సాక్షి సూర్యాపేట

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



లింగాకర్షక బుట్టలతో ..

వరిలో మొగిపురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు వాడాలని శాస్త్రవేత్త పద్మావతి సూచించారు. - 10లో



ప్రైవేట్ క్లీనిక్‌లలో తనిఖీలు

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం శనివారం హాలియా, నిడమనూరులో పలు ప్రైవేట్ క్లీనిక్‌లలో తనిఖీలు చేసింది. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	587.20 అడుగులు
ఇన్‌ఫ్లో	:	2,41,831 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	2,41,831 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,211 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	9,076 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం హుజూర్ నగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పాలకవీడు మండలంలో నిర్మాణంలోఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములపై ఉదయం సమీక్షిస్తారు. అనంతరం హుజూర్‌నగర్‌లో ఐటీఐ, ఏటీసీ, డిగ్రీ కళాశాల భవనాలను, హౌసింగ్ కాలనీ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ఇటీవల పట్టణంలో మృతి చెందిన రైస్ మిల్లర్ గెల్లి అప్పారావు, గెల్లి అరుణ కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శిస్తారు. మధ్యాహ్నం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు, ట్రైసైకిళ్ల పంపిణీ చేస్తారు. అనంతరం చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద ఎంబీసీ లిఫ్టు పనులు, దొండపాడు వద్ద లిఫ్టు పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం కోదాడ మండలానికి వెళతారు.

పెంచికల్‌దిన్న పీఏసీఎస్ చైర్మన్ సస్పెన్షన్

- నూతన చైర్మన్‌గా సిద్ధపంగ శ్రీను

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ శాఖమూరి శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార సంఘం అధికారి పద్మ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. చైర్మన్ శ్రీకాంత్ బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ సంఘానికి సంబంధించిన నగదు మొత్తాన్ని సొంతానికి వాడుకుంటూ తిరిగి చెల్లించకపోవడంతో పాటు అధికారుల నోటీసులకు సైతం స్పందించకపోవడంతో సస్పెండ్‌కు గురైనట్లు సీఈవో వెంకన్న తెలిపారు. చైర్మన్‌తో పాటు మరో డైరెక్టర్ వల్లంశెట్ల నారాయణ డిఫాల్టర్‌గా తేలడంతో ఆయనను కూడా సస్పెండ్ చేసినట్లు చెప్పారు. సస్పెండ్‌కు గురైన శ్రీకాంత్ స్థానంలో ప్రస్తుతం వైస్ చైర్మన్ సిద్ధపంగ శ్రీనుకు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

సూర్యాపేటటౌన్ : తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహించిన ఘనత కేసీఆర్ దేనని గుర్తు చేశారు. ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే బతుకమ్మ తెలంగాణ ఉద్యమంతో ఖండాంతరాలకు విస్తరించిందని తెలిపారు. పోరాడి సాధించిన తెలంగాణలో బతుకమ్మను అధికారికంగా నిర్వహించుకునేలా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ చీరలు బంద్‌నైయని విమర్శించారు. బతుకమ్మ, దేవీనవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ప్రజలందరికీ బతుకమ్మ, దేవీశరన్నవరాత్రోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

యూరియా కొరతను నివారించాలని వినతి



కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : యూరియా కొరతను నివారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శనివారం సూర్యాపేట కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో ఎక్కువ శాతం ఆయకట్టు ఉన్నందున అధికంగా యూరియా కేటాయించాలన్నారు. కార్యక్రమంలో గుండు వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్ కుమార్, ఖమ్మంపాటి రాము, హేమలత, ఎండి పాషా పాల్గొన్నారు.

మట్టపల్లిలో వైభవంగా అగ్నిమథనం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం యాజ్ఞీకులు బొర్రా వెంకటవాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వాస్తుపూజ, వాస్తుహోమం, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠాపన, పవిత్రములశుద్ధి, సప్తదశకుంభాసాధన, సాయంత్రం అగ్నిధ్యానం, శయ్యావేది ప్రకల్పనం, పవిత్రఆవాహనం, సుదర్శన యంత్రస్థాపన, బలిహరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఆదివారం శతకలశస్నపనం ,పవిత్రారోపణం, బలిహరణ తదితర కార్యక్రమాలుంటాయని ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ తెలిపారు.

బతుకమ్మ సందడి



ఎంగిలిపూల బతుకమ్మను పురస్కరించుకొని శనివారం సూర్యాపేటలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



సూర్యాపేటలో శ్రీలక్ష్మీవెంకటసాయి ఒకేషనల్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు తదితరులు -సూర్యాపేటటౌన్

స్కూల్ బస్సులకు ప్రాక్సిమిటీ మిర్రర్లు

- బస్సు 360 డిగ్రీల్లో కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని రవాణా శాఖ ఆదేశాలు
- ఇటీవల స్కూల్ బస్సుల కింద పడి ఇద్దరు చిన్నారుల మృత్యువాత
- ప్రమాదాల నివారణ పై దృష్టిపెట్టిన రవాణా శాఖ
- నెల రోజుల్లోగా మిర్రర్లు ఏర్పాటు చేయాలని ఆదేశం
- బస్సుల ఫిట్‌నెస్, ఇతర అంశాలపై తనిఖీలకు ప్రత్యేక బృందాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో ఇటీవల జరిగిన స్కూల్ బస్ ప్రమాదాల్లో ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడి తల్లిదండ్రులకు కడుపు కోత మిగిలింది. పది రోజుల వ్యవధిలో రెండు స్కూల్ బస్‌ల కింద ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో జిల్లాలో సంచలనం సృష్టించింది. దీంతో ప్రమాదాల నివారణకు రవాణా శాఖ శ్రీకారం చుట్టింది. స్కూల్ బస్సులకు ప్రాక్సిమిటీ మిర్రర్లు (కుంభాకార దర్పణాలు) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. స్కూల్ బస్సు 360 డిగ్రీల్లో కనిపించేలా అద్దాలు బిగించుకోవాలని రవాణా శాఖ పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించింది.



బస్సు పూర్తిగా కనిపించేలా..

ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి స్కూల్ బస్‌కు కుడి, ఎడమ పక్కన, ముందుభాగం, వెనుక భాగం కనిపించేలా ప్రాక్సిమిటీ మిర్రర్లను ఏర్పాటు చేయాలని రవాణాశాఖ నిర్ణయించింది. బస్సులకు ముందు భాగంగా సైడ్‌కు ఉండే ఈ అద్దాల్లో బస్‌కు ఉన్న చక్రాలు, బంపర్, రోడ్డు అంతా కనిపిస్తుంది. దాంతో అక్కడకు పిల్లలు వస్తే డ్రైవర్‌కు అద్దంలో చూస్తే కనిపిస్తుంది. డ్రైవింగ్ సీటుకు ముందు బస్ బయట నుంచి పెద్ద మిర్రర్‌ను ఏర్పాటు చేస్తారు. దాని ద్వారా బస్ ముందు ఎవరైనా చిన్న పిల్లలు వెళ్లినా అద్దంలో నుంచి డ్రైవర్‌కు కనిపిస్తుంది.

నెల రోజుల్లో ఏర్పాటు చేయాల్సిందే..

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,649 స్కూల్ బస్సులు ఉండగా, అందులో కాలం చెల్లినవి, మరో ఒకటీ రెండు నెలల్లో కాలం చెల్లే బస్సులు, మూసివేసిన పాఠశాలలకు చెందినవి 54 ఉన్నాయి. వాటిని మినహాయించి మిగతా 1,595 స్కూల్ బస్‌లకు ప్రాక్సిమిటీ మిర్రర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో నల్లగొండ జిల్లాలో 699, సూర్యాపేట జిల్లాలో 522, యాదాద్రి భువనగిరి జిల్లాలో 337 ఉన్నాయి. వీటికి నెల రోజుల్లోగా ప్రత్యేకంగా ఆయా అద్దాలను బిగించాలని రవాణ శాఖ ఆయా పాఠశాలల యజమానులకు ఆదేశాలు జారీ చేసింది. రెండు రోజుల కిందట ఆయా యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి మరీ ఈ విషయాన్ని స్పష్టం చేసినట్లు నల్లగొండ ఎంవీఐ లావణ్య తెలిపారు. ఇటీవల నల్లగొండ జిల్లాలో జరిగిన రెండు సంఘటనల్లోనూ ప్రమాదానికి కారణమైన బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉన్నాయని వెల్లడించారు.

స్కూల్ బస్‌ల తనిఖీకి బృందాలు

స్కూల్ బస్‌లను ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్‌తో పాటు మిర్రర్లు అన్ని సక్రమంగా ఉన్నాయా లేవా అనే విషయాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసేందుకు రవాణ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శిక్షణ కోసం వచ్చిన ఎంవీఐలు, స్థానిక రవాణా శాఖ సిబ్బందితో కలిపి 13 బృందాలను రవాణ శాఖ ఏర్పాటు చేసింది.

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

స్కూల్ బస్సుల వల్ల పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎంతో విలువైన పిల్లల ప్రాణాలను కాపాడేందుకు, ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేకంగా అద్దాలను బిగించేలా చర్యలు చేపడుతున్నాం. బస్సు చుట్టూ అన్ని వైపులా కనిపించేలా, పిల్లలు పూర్తిగా బస్సుకు దూరంగా వెళ్లారా? లేదా? అన్నది డ్రైవర్ ఆయా అద్దాల్లో చూసుకొని వెళ్లేలా చర్యలు చేపడుతున్నాం. – వాణి, నల్లగొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్

పట్టుదలతో చదివి ఉన్నత స్థానం చేరుకోవాలి

- కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్
- సూర్యాపేట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

సూర్యాపేటటౌన్ : విద్యార్థినులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి సాంకేతిక, కృత్రిమ మేధస్సు యుగంలో భవిష్యత్తులో ఏమి కావాలో విద్యార్థినులు లక్ష్యం నిర్ణయించుకొని దాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చాలా క్లిష్టమైన పరిస్థితులు విద్యార్థులకు ఉంటాయని, ఇక్కడ మనం ఎంత మంచిగా సబ్జెక్టులు నేర్చుకుంటామో దానిమీదనే జీవితం మొత్తం ఆధారపడి ఉంటుందన్నారు. జీవితంలో జరిగే ముఖ్యమైన అంశాలను నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధ పెట్టి ఏ సబ్జెక్టుపై ఆసక్తి ఉంటదో దానిలో నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. విద్యార్థినిలు మంచి పోషకాహారం తీసుకోవడం ద్వారా మంచి ఆలోచనలు వస్తాయని, తద్వారా మంచి అలవాట్లు అలవర్చుకోవచ్చన్నారు. పాలిటెక్నిక్ కాలేజీలో 95శాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమైన విషయమన్నారు. అనంతరం 108 మంది విద్యార్థినిలకు గ్రాడ్యుయేట్ పట్టా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం సీతారాం, ప్రిన్సిపల్ సుజాత, హెచ్ఓడీలు బీ.వీ రావు, రాజేశ్వరరావు, అంజయ్య, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పట్టా అందుకున్న విద్యార్థినులతో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు

సూర్యాపేటటౌన్ : విధుల నిర్వహణలో పోలీసులు నిర్లక్ష్యం వహించొద్దని, సమయపాలన పాటించాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ సూచించారు. శనివారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో శాంతి భద్రతల పరిస్థితి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసుల పరిష్కారం, రాత్రి గస్తీ విధానాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు.. ప్రజలకు అందుబాటులో ఉండి ఫిర్యాదులు, డయల్ 100 కాల్స్ పై వేగంగా స్పందించాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, వెంకటయ్యలకు మెరిటోరియస్ సర్వీస్ రివార్డ్స్, ఎస్‌ఐలు రవీందర్, సురేష్ రెడ్డి, రవీందర్, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీకాంత్, కానిస్టేబుల్ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లుకు రివార్డులు అందించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, శ్రీధర్‌రెడ్డి, డీసీ ఆర్‌బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

30వ తేదీ వరకు '30పోలీస్ యాక్ట్'

జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి ఈనెల 30వ తేదీ '30 పోలీస్ యాక్ట్' అమల్లో ఉంటుందని ఎస్పీ నరసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించవద్దని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటం



మాట్లాడుతున్న వేమనూరు వెంకటేశ్వర్లు

సూర్యాపేట అర్బన్: సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటం చేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమనూరు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ సర్వసభ్య సమావేశం శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో డిస్కం జిల్లా అధ్యక్షుడు పి.వేణు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చాలని, ఆర్టిజన్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డిస్కం కార్యదర్శి జి.సాయిబాబా, రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు కె.రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, సలహాదారు ఆర్.జనార్దన్ రెడ్డి, డిస్కం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.వెంకన్న, డిస్కం కార్యదర్శి ఎం.భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసరెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముందు దాదాపు 400 ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

పులిచింతలను సందర్శించిన కేఆర్ఎంబీ చైర్మన్

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టును కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండే శనివారం సందర్శించారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా డ్యాం వద్ద చీపురుతో ఊడ్చారు. ఈ సందర్భంగా సిబ్బందితో ప్రతిజ్ఞచేయించారు. అనంతరం జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తిని పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. ఆయన వెంట నీటి సంఘం ప్రెసిడెంట్ ఆళ్ల గోపాలకృష్ణారెడ్డి, ఈఈ గుణాకర్‌రావు, డీఈ వెంకట్, ఏఈ ఆశ, సలీమ పాల్గొన్నారు.



ప్రాజెక్టు వద్ద స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండే

వేలిముద్రల విధానం విరమించుకోవాలి



అర్వపల్లిలో పీఏసీఎస్ ఎదుట హైవేపై రైతులతో కలిసి రాస్తారోకో చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

- అర్వపల్లి పీఏసీఎస్ ఎదుట రైతుల రాస్తారోకో

అర్వపల్లి: యూరియా పంపిణీకి సంబంధించి ఇ-పాస్ యంత్రం ద్వారా రైతుల వేలిముద్రలు తీసుకోవడంతో గంటల కొద్దీ సమయం తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు శనివారం అర్వపల్లిలోని పీఏసీఎస్ ఎదుట సూర్యాపేట-జనగామ హైవేపై గంటన్నర పాటు రాస్తారోకో చేశారు. తెల్లవారుజాము నుంచి సుమారు 800మందికి పైగానే రైతులు పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం వేచి ఉన్నారు. సాయంత్రం వరకు కూడా 300మంది రైతులకు మాత్రమే యూరియా అందింది. అయితే మండే ఎండలో గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వివిధ పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. వ్యవసాయ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ రమేష్‌బాబు, ఏఓ గణేష్‌లను నిలదీశారు. కాగా రాస్తారోకోతో హైవేపై వందలాది వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు, వ్యవసాయ అధికారులు రైతులకు నచ్చజెప్పినా శాంతించలేదు. తమకు ఇ-పాస్ విధానం వద్దని రైతులకు బిల్లుల ద్వారా యూరియా అందించాలని కోరారు. అదే సమయంలో వర్షం రావడంతో రైతులు రాస్తారోకో విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పోలెబోయిన కిరణ్, సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బొడ్డు రామలింగయ్య, నున్న యాదగిరి, పోలెబోయిన పెదలింగయ్య, సంపత్ కిరణ్, జహంగీర్, శిగ వెంకన్న, రవీందర్‌నాయక్, నాగరాజు, సురేష్, యాదగిరి పాల్గొన్నారు.



కోదాడరూరల్: గణపవరం గోదాము వద్ద యూరియా కోసం క్యూలో నిలబడిన రైతులు

తప్పని యూరియా తిప్పలు

కోదాడరూరల్ : రైతులకు యూరియా తిప్పలు ఇంకా తప్పడం లేదు. వరి పొలాలు నాట్లు పెట్టి నెల రోజులు దాటుతున్న సమయంలో ప్రస్తుతం పంట యూరియా వేసే అదునుకు చేరుకుంది. దీంతో రైతులు నానాపాట్లు పడుతున్నారు. కోదాడ పీఏసీఎస్ పరిధిలోని గణపవరం ఎరువుల గోదాముకు శనివారం 200 యూరియా బస్తాల లోడ్‌వచ్చింది. ఆ యూరియా కోసం దాదాపు 300 మంది రైతులు క్యూలో చెప్పులు పెట్టి నిలబడ్డారు. పీఏసీఎస్ సిబ్బంది రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులను సీరియల్‌లో పెట్టారు.5 ఎకరాలకు పైగా భూమి ఉన్న వారికి రెండు బస్తాలు, అంతకు తక్కువ ఉన్నవారికి బస్తా చొప్పున పోలీసుల పహారాలో రైతులకు పంపిణీ చేశారు. సీరియల్‌లో ఉండి యూరియా అందని రైతులకు తర్వాత వచ్చేలోడ్‌లో ముందుగా ఇస్తామని చెప్పి పంపించారు.

బాలల భవితకు బాట వేసేలా..

- కలెక్టర్ చొరవతో అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న రీతిలో పూర్వ ప్రాథమిక విద్య
- ఆట,పాటలు, అభినయంతో ప్రత్యేక బోధన
- ఎంతో ఆసక్తిచూపిస్తున్న చిన్నారులు

భానుపురి (సూర్యాపేట) : బాల్య దశలోనే చిన్న పిల్లలకు మంచి పద్ధతులు, అలవాట్లు నేర్పిస్తే భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగేందుకు ఎంతగానో దోహదపడతాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని బాలల బంగరు భవితకు పునాదులు వేసేలా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ప్రత్యేక చొరవతీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ఆటపాటలు, అభినయంతో బోధించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేంద్రాలను నిత్యం సందర్శిస్తూ పిల్లల సామర్థ్యాలను అంచనావేస్తూ ఎంతో ప్రోత్సహిస్తున్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి..

మనిషి జీవితంలో మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసే పునాది దశగా భావించవచ్చు. ఈ వయసులో నేర్చుకున్న నైపుణ్యాలు పిల్లల్లో శారీరక అభివృద్ధితో పాటు మెరుగైన ఆరోగ్యానికి దారితీస్తాయి. ఇవి పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్ప డతాయి. తద్వారా మంచి పౌరులుగా ఎదగడానికి ఎంతగానో దోహదపడతాయి. ఈ కారణంతోనే నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా 3నుంచి 6సంవత్సరాల లోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. పిల్లలకు ప్రతినెలా మంచి అలవాట్లను నేర్పిస్తున్నారు. వీరికి ఇప్పటికే పౌష్టికాహారం అందిస్తుండగా.. ఇటీవల నుంచి ఇమ్యునైజేషన్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, పోషణ, ఆరోగ్య విద్య వంటివి అందిస్తున్నారు.





అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మమేకమైన కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

పకడ్బందీగా అమలు

జిల్లాలో 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 5,168 మంది గర్భిణులు, 36,378 మంది చిన్నారులు, 4,168 మంది బాలింతలు పౌష్టికాహారాన్ని పొందుతున్నారు. జిల్లాలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ప్రత్యేక శ్రద్ధతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. పిల్లలకు బట్టీ పద్ధతిలో కాకుండా ఆసక్తికరంగా ప్రీస్కూల్ అంశాలను బోధిస్తున్నారు. పిల్లలకు కథలను చదివి వినిపించడం లాంటి పద్ధతి కాకుండా అభినయాల ద్వారా బోధిస్తున్నారు. దీంతో పిల్లలు కథలను బాగా అర్థం చేసుకోవడంతో పాటు, పాత్రలకు తగ్గట్టుగా నటిస్తున్నారు. కలెక్టర్ ప్రత్యేకించి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తూ పిల్లల ఆట పాటల ద్వారా వారి తెలివితేటలను, సామర్థ్యాలను, వారి చలాకీతనాన్ని అంచనా వేస్తూ ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు చిన్నప్పుడు పాటల్ని బాగా ఇష్టపడతారు. తల్లి పాడే జోల పాట మొదలుకొని అభినయంతో కూడిన పాటలు పిల్లలకు ఎంతో ఇష్టం. అలాంటి పాటలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నేర్పిస్తున్నారు.

ప్రత్యేక చొరవ..

ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పానికి తేజస్ నందలాల్ పవార్ లాంటి కలెక్టర్ తోడైతే నిజంగా భవిష్యత్తులో వారు మంచి పౌరులుగా తయారవుతారనడంలో ఎలాంటి సందేహం లేదు. దీని ద్వారా వారి శారీరక అభివృద్ధితో పాటు, మానసిక సామర్థ్యాలు, ఉల్లాసం, ఇతర పిల్లలతో కలిసి మెలిసి ఉండడం, స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండడం, ఆటలు, పాటలతో పిల్లల్లో ఆలోచించే సామర్థ్యం సైతం చిన్నప్పటి నుంచి అలవడుతుంది. దీంతో వారి జ్ఞానం పెంపొందడమే కాకుండా, వివిధ రకాల వస్తువులను తయారు చేయడం, బొమ్మలు గీయించడం లాంటివి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేస్తున్నారు.

పోషణ మాసోత్సవాల్లో..

పిల్లలు అన్ని అంశాలలో చురుకుగా ఉండేందుకు ఇప్పటికే ప్రీస్కూల్ కిట్లను అందించారు. ప్రత్యేకించి డ్రాయింగ్‌తో పాటు, సింగింగ్, ఇంగ్లిష్ లెర్నింగ్ వంటి వినూత్న కార్యక్రమాలను కలెక్టర్ నేర్పించేలా చేస్తున్నారు. స్వయంగా కలెక్టర్ అంగన్‌వాడీ పిల్లలతో మాట్లాడి వారిని ఆట పాటలతో చైతన్య పరుస్తున్నారు. ఈనెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహార పంపిణీ, ఆరోగ్య పరీక్షల నిర్వహణ,అంగన్ వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్ ల పెంపకం, రకరకాల అంశాల పట్ల ఆట పాటలతో వారికి అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ ఒక కార్యక్రమాన్ని నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు.



తీరొక్క పూల పండుగ

బతుకమ్మ పండుగ నేపథ్యం ఇదీ..

బతుకమ్మకు సంబంధించి అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అయితే పూర్వం భూస్వాముల ఆకృత్యాలను భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుందని, ఆమెను ఊరి ప్రజలు చిరకాలం 'బతుకమ్మ' అని దీవించారని, అందుకనే ఈ పండుగ మహిళలను కీర్తిస్తూ జరుపుకునే పండుగ అని ఎక్కువగా చెబుతుంటారు. అదే విధంగా చోళ దేశాన్ని పరిపాలించే ధర్మంగదుడి వంద మంది కుమారులు యుద్ధంలో వీర మరణం పొందడంతో.. రాజు భార్య సత్యవతి సంతాన ప్రాప్తి కోసం లక్ష్మీదేవిని వేడుకోవడంతో కుమార్తె జన్మిస్తుంది. కనీసం ఆమైనా బతకాలని కోరుకుంటూ.. చల్లంగా 'బతుకమ్మ' అని దేవతలు, మునులు దీవించారని ప్రతీతి. ఆ రోజు నుంచి ఆ యువరాణి దీర్ఘాయుష్కురాలై బతుకాలని కోరుతూ బతుకమ్మని కొలవడం అనావాయితీగా వస్తోందనే కథ ప్రచారంలో ఉంది.

నేటి నుంచి బతుకమ్మ సంబరాలు

- తొలి రోజు ఎంగిలి పువ్వు బతుకమ్మ
- తొమ్మిది రోజుల పాటు ఆటపాటలతో సందడి చేయనున్న ఆడపడుచులు



ఏమేమీ పువ్వొప్పనే గౌరమ్మ.. ఏమేమీ కాయొప్పనే గౌరమ్మ.. అంటూ తెలంగాణ ఆడపడుచులంతా కలిసి బతుకమ్మను కొలిచే సమయం రానే వచ్చింది. తెలంగాణ అస్తిత్వానికి.. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి ప్రకృతితో అనుబంధాన్ని తెలియజేసే బతుకమ్మ పండుగ ఆదివారం నుంచి ప్రారంభంకానుంది. ప్రకృతిలో లభించే రంగు రంగుల పువ్వులను తీసుకొచ్చి మహిళలంతా బతుకమ్మను పేర్చి, ఒకే చోట చేరి ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. పూలనే దైవంగా కొలిచే బతుకమ్మ సంబరాలు ప్రతి ఏడాది మహాలయ అమావాస్య లేదా భాద్రపద అమావాస్య రోజున ఎంగిపూల బతుకమ్మతో మొదలై.. తొమ్మిది రోజుల తర్వాత సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

- రామగిరి(నల్లగొండ) , యాదగిరిగుట్ట

ప్రకృతి పూలే బతుకమ్మకు అందం

ప్రకృతిలో దొరికే తీరొక్క పూలతో బతుకమ్మను పేరుస్తారు. తంగేడు, బంతి, చామంతి, గులాబీ ఇలా అన్ని రకాల పూలు బతుకమ్మకు శోభనిస్తాయి. బతుకమ్మ తయారీలో వాడే ప్రతీ పువ్వు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడుతాయి. వర్షాకాలంలో నిండుకుండల్లాగా ఉండే కుంటలు, చెరువులు వీటితో శుభ్రం అవుతాయి. వీటన్నింటి వెనుక సైన్స్ ఉందని నిపుణుల అభిప్రాయం.

తొమ్మిది రోజులు.. వివిధ పేర్లు

- **ఎంగిలి పూల బతుకమ్మ:** తొలిరోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. ఈ రోజు బియ్యం పిండి, నువ్వులు కలిసి నైవేద్యంగా పెడతారు.
- **అటుకుల బతుకమ్మ:** రెండోరోజు బతుకమ్మను అటుకుల బతుకమ్మ అంటారు. ఈ రోజు సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు నైవేద్యంగా సమర్పిస్తారు.
- **ముద్దపప్పు బతుకమ్మ:** మూడోరోజు జరుపుకునే బతుకమ్మను ముద్దపప్పు బతుకమ్మగా కొలుస్తారు. ఈరోజు ముద్దపప్పు, బెల్లం, పాలతో నైవేద్యం తయారు చేస్తారు.
- **నాన బియ్యం బతుకమ్మ:** నాలుగో రోజు బతుకమ్మను నాన బియ్యం బతుకమ్మ అని పిలుస్తారు. ఈరోజు నానబెట్టిన బియ్యం, బెల్లం, పాలతో నైవేద్యం సమర్పిస్తారు.
- **అట్ల బతుకమ్మ:** ఐదో రోజు బతుకమ్మను అట్ల బతుకమ్మ అని పిలుస్తారు. ఈరోజు గోధుమ అట్లు లేదా బియ్యం పిండితో చేసిన అట్లను నైవేద్యంగా పెడతారు.
- **అలిగిన బతుకమ్మ:** ఆరో రోజు బతుకమ్మను అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. ఈరోజు బతుకమ్మ ఆడరు. ఎలాంటి నైవేద్యం పెట్టుకోరు.
- **వేపకాయల బతుకమ్మ:** ఏడో రోజు బతుకమ్మను వేపకాయల బతుకమ్మ అని పిలుస్తారు. ఈరోజు బియ్యం పిండిని వేపకాయల్లా తయారు చేసి నైవేద్యం సమర్పిస్తారు.
- **వెన్నముద్ద బతుకమ్మ:** ఎనిమిదో రోజు బతుకమ్మను వెన్నముద్ద బతుకమ్మగా పిలుస్తారు. ఈరోజు నువ్వులు, వెన్నముద్ద, బెల్లంతో నైవేద్యం సమర్పిస్తారు.
- **సద్దుల బతుకమ్మ:** తొమ్మిదో రోజు బతుకమ్మ సద్దుల బతుకమ్మగా పిలుస్తారు. కొన్నిచోట్ల పెద్ద బతుకమ్మ అని కూడా పిలుస్తారు. ఈ రోజు తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మ పేర్చుతారు. పెరుగన్నం, పులిహోర, కొబ్బరిపొడి, నువ్వులపొడి తదితర నైవేద్యాలను మహిళలు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు. సద్దుల బతుకమ్మతో బతుకమ్మ ఉత్సవాలు ముగుస్తాయి.

తంగేడు పూలు



బతుకమ్మ తయారీలో ముందు వరసలో ఉండేవి తంగేడు పూలు, పసిడి వర్ణంలో మెరిసే వీటిలో ఔషధ గుణాలు ఎక్కువగా ఉంటాయి. మన దగ్గర ఎన్ని పువ్వులున్నా.. తంగేడు పువ్వు లేకపోతే బతుకమ్మ పూర్తికానట్లే భావిస్తారు. అంతేకాకుండా జ్వరం, మలబద్ధకానికి ఇది మంచి ఔషధం. తంగేడు పూలని ఆరబెట్టి దాంట్లో ఉసిరికాయ పొడి, పసుపు సమాన భాగాలుగా తీసుకొని కలపాలి. దీన్ని రెండు పూటలా తినడానికి అర గంట ముందు గోరువెచ్చని నీటిలో కలిపి తాగితే షుగర్ వ్యాధి అదుపులో ఉంటుంది. ఇది తెలంగాణ ప్రాంతంలో విరివిగా దొరుకుతాయి. అంతేకాదు తంగేడు పువ్వు తెలంగాణ రాష్ట్ర పుష్పం.

తామర పూలు



తామర పువ్వు అందానికి, స్వచ్ఛతకు ప్రతీక. లక్ష్మీదేవి నివాసం తామర పూలు. దీన్ని రక్తస్రావ నివారణకు ఉపయోగిస్తారు. సుగంధ ద్రవ్యాల్లో ఉపయోగించే ఈ తామరపూలు ఎన్నో రంగుల్లో ఉంటాయి. ఈ తామర పూలు ఆరోగ్యానికి కూడా చాలా ఉపయోగపడతాయి. మలబద్ధకంతో బాధపడేవారికి తామర తైలం దివ్య ఔషధంగా పనిచేస్తుంది. తామర పువ్వు రేకులు, కుంకుమ పువ్వు, కలువ పువ్వులతో కలిపి ముఖానికి రాస్తే మంచి ఫలితం ఉంటుంది. అంతేకాదు ఈ పువ్వుతో అనేక చర్మ సంబంధ వ్యాధులను నివారించవచ్చు. కళ్ల ఎర్రగా మారితే తామర పూల రేకులు కళ్లమీద పెట్టుకుంటే వేడి తగ్గి ఉపశమనం కలుగుతుంది.

గుమ్మడి పువ్వు



గుమ్మడి పువ్వుకు బతుకమ్మలో ప్రథమ స్థానం ఉంటుంది. గుమ్మడి పువ్వునే గౌరమ్మగా భావించి పూజిస్తారు. గుమ్మడి పువ్వులో ఎ, సి విటమిన్లు ఉంటాయి. వయసు మీద పడ్డాక వచ్చే కాళ్ల నొప్పుల్ని ఈ పువ్వు తగ్గిస్తుంది. ప్రొస్టేట్ గ్రంథికి ఎలాంటి హాని కలగకుండా చేస్తుంది. డ్రై స్కిన్ ఉన్నవాళ్లు వాడితే చాలా మంచిది.

గునుగు పూలు



గునుగు పువ్వు గడ్డిజాతికి చెందిన పువ్వు. బతుకమ్మ అలంకరణలో గునుగు పువ్వు ఎంతో శోభనిస్తుంది. జొన్న కంకిలా కనిపించే ఈ గునుగు పూలు చాలా రంగుల్లో ప్రకృతిలో కనిపిస్తాయి. గునుగు పూలను అతిసార నివారణకు మందుగా వాడుతారు. ఈ పువ్వును చర్మంపై గాయాలు, పొక్కులు, క్షయ వ్యాధి నివారణకు ఉపయోగిస్తారు. రక్తపోటును అదుపులో ఉంచడంలో ఈ పువ్వుకు మరేది సాటిరాదని ఆయుర్వేదం చెబుతోంది.

చామంతి, రుద్రాక్ష పూలు



బతుకమ్మ తయారీలో బంతి తర్వాతి స్థానం చామంతిదే. ఈ సీజన్‌లో బాగా దొరికే పూలు ఇవే కాబట్టి వీటిని బతుకమ్మలో ఎక్కువగా వాడుతుంటారు. రుద్రాక్ష పూలకు పుల్లలు గుచ్చి బతుకమ్మ పేర్చడానికి ఉపయోగించవచ్చు. రంగురంగుల రుద్రాక్ష పూలను వరుసల్లో పేర్చుకుంటే బతుకమ్మ అందంగా ఉంటుంది.

బీర పువ్వు



బీర పువ్వు పసుపుపచ్చగా ఉంటుంది. బతుకమ్మకు చక్కటి అందాన్నిస్తుంది. బీర పువ్వు సీజనల్ ఫ్లవర్. బీరకాయలను ఎండబెట్టి అందులో ఏర్పడే పీచును రంగుల్లో వాడతారు. బతుకమ్మను పేర్చేటప్పుడు నుదుటన తిలకం దిద్దినట్లుగా బీర పువ్వును పెడతారు. వీటిలో బంతి, చామంతి వర్షాకాలం దోమల నివారణకు ఉపయోగపడుతుంది. అదేవిధంగా నందివర్ధనం ప్రత్యేక గుణాలు కల పుష్పం. దీనివల్ల కండ్లకు మేలు జరుగుతుంది. అంతేకాదు ఇది పలు ఆయుర్వేద ఔషధాల్లో, చిట్కా వైద్యంలో ఉపయోగిస్తారు.

సీత జడ పూలు



సీత జడ పూలనే సీతమ్మవారి జడగంటలు అని అంటారు. ముదురు రంగులో కనిపించే ఈ పూలు కనువిందు చేస్తాయి. చక్కటి ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. మెత్తగా పట్టుకుచ్చులా అలరిస్తాయి. ఈ పూలు మన తోటలో ఉంటే ఎంతదూరం నుంచైనా ఇట్టే కనిపిస్తాయి. ఈ పూలను నారలు, రంగుల తయారీలో వాడతారు.

నందివర్ధనం పూలు



తెల్లని నందివర్ధనం పూలతో అలంకరించిన బతుకమ్మ చక్కటి సువాసన వెదజల్లడమే కాదు.. అందంగానూ కనిపిస్తుంది. ఈ పూలు మిగతా పూలతో పోల్చితో ప్రత్యేకంగా కనిపిస్తాయి.

మందార, గులాబీ, జిల్లేడు పూలు



ఎర్రటి మందార పూలు బతుకమ్మకు ఆకర్షణీయంగా చేస్తుంది. మందార పూలు దొరక్కపోతే గులాబీలను కూడా ఉపయోగిస్తారు. జిల్లేడు పూలను సైతం బతుకమ్మ తయారీలో ఉపయోగించవచ్చు.

మహాలయ అమావాస్య వరకు పితృపక్షాలు

- మరణించిన వ్యక్తుల పేర్లతో దానాలు చేస్తే మంచిది
- యాదగిరి క్షేత్రం ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు



యాదగిరిగుట్ట: మనం దేవుళ్లను ఎలా ఆరాధిస్తామో.. పూర్వీకులను సైతం అదేవిధంగా ఆరాధించాలి. పితృదేవతలు అంటే మన కుటుంబానికి సంబంధించిన మూడు తరాల పెద్దలు అని అర్థం. వారందరికీ పితృపక్షాల కాలంలో తర్పణాలు, శ్రాద్ధ కర్మలు, పిండ ప్రధానాలు చేయడంతో మంచి ఫలితాలు ఉంటాయని యాదగిరి క్షేత్రం ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు చెబుతున్నారు. మహాలయ పక్షం ముఖ్య ఉద్దేశం గురించి ఆయన మాటల్లోనే..

కుటుంబ పెద్దలను కోల్పోయిన వారు, తల్లిదండ్రులు ఇద్దరూ లేని వారు మహాలయ పక్షంలో తప్పనిసరిగా పితృకర్మలు చేయాలి. భాద్రపద మాసంలో వచ్చే పౌర్ణమి నుంచి అమావాస్య వరకు ఉండేవి పితృపక్షాలు. ఈ అమావాస్యనే మహాలయ అమవాస్య అని కూడా అంటారు. కుటుంబానికి సంబంధించిన పెద్దలు, తెలిసీతెలియక మరణించిన వారి తిథి, వారం, నక్షత్రం తెలియని పక్షంలో, తెలియకుండా ఎక్కడో చనిపోయిన వారు పితృ దేవతలుగా ఉంటూ తమ పిల్లల కోసం ఎదురు చూస్తుంటారు. ఎందుకంటే తమ పిల్లలు అన్నం పెట్టాలని ఈ పితృ పక్షంలో ఎదురు చూస్తారు. ఈ నేపథ్యంలో మరణించిన వారి పేర్లతో దానాలు, శ్రాద్ధ కర్మలు, తర్పణాలు చేస్తే తమకు చెందుతుంది కాబట్టే ఈ అమవాస్యకు పితృపక్షం అనే పేరు వచ్చింది. సంవత్సరంలో 365 రోజులు అందరికి ఉంటే.. మరణించిన వారికి మాత్రం మహాలయ అమావాస్య ఒక్కటే రోజు ఉంటుంది. నదుల్లో తర్పణాలు, సూర్యుడికి తర్పణాలు, శ్రాద్ధ కర్మలు చేస్తే బాగుంటుంది. దేవాలయాల్లో, పుణ్య క్షేత్రాల్లో ఈ దానాలు చేస్తే మరింత ఫలితం దక్కుతుంది. పల్లెటూర్లలో తాతలు, తండ్రుల పేర్లతో బియ్యంతో పాటు ఇతర సామగ్రి పంపిణీ చేస్తారు. ఈ పితృపక్షాలు పౌర్ణమి నుంచి అమవాస్య నుంచి ఎప్పుడైనా దానాలు, దర్పణాలు ఇవ్వొచ్చు.

పూలను పూజించే పండుగ బతుకమ్మ



ప్రపంచంలో పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక. మా సొంతూరు మిర్యాలగూడ సమీపంలోని భల్లునాయక్ తండాలో నా చిన్న వయస్సులో బతుకమ్మ పండుగను చాలా ఉత్సాహంగా జరుపుకునేవాళ్లం. రకరకాల పువ్వులతో బతుకమ్మ చేసి, పసుపుతో చేసిన గౌరమ్మను మనసారా కొలిచేవాళ్లం. మహాలక్ష్మి ప్రతిరూపంగా పూలను అందంగా గోపురం ఆకృతిలో పేర్చి తొమ్మిది రోజుల పాటు ఆటపాటలతో, వివిధ నైవేద్యాలతో అమ్మవారిని కొలుచుకుంటారు. ప్రపంచంలో ఎక్కడైనా బతుకమ్మ పండుగ జరుగుతుందంటే తెలంగాణవారని గర్వంగా చెప్పుకునే స్థాయికి బతుకమ్మ వచ్చింది. బతుకమ్మ పండుగ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మహిళలను భాగస్వాములను చేసింది.

- సూర్యా ధనుంజయ, వైస్ ఛాన్సలర్, చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, హైదరాబాద్

ఆంక్షలకు ఎదురు తిరిగిన తీరు అద్భుతం



బతుకమ్మ ఆడకుండా నాటి నిజాం పెట్టిన ఆంక్షలకు ఎదురు తిరిగిన ఘనత తెలంగాణ ఆడపడుచులది. బతుకమ్మ పండుగను భవిష్యత్ తరాలకు చేరవేయాలని, పూలపై మహిళలకు ఉన్న మమకారానికి నాటి సంఘటన నిదర్శనం. నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజలు మన సంస్కృతిని బతుకమ్మ ద్వారా చాటి చెబుతున్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా పూలను పూజించే విశిష్టమైన సంప్రదాయం కేవలం మన తెలంగాణలో బతుకమ్మ పండుగలో ప్రతిబింబిస్తోంది.

- వెల్దండి శ్రీధర్, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్జీ కళాశాల

స్వర్ణగిరీశుడికి తిరువీధి ఉత్సవ సేవ

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవను ఆలయ అర్చకులు నిర్వహించారు. అంతకుముందు ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం, వసంతోత్సవ సేవ, మధ్యాహ్నం సుమారు 5వేల మందికి అన్నప్రసాద వితరణ, రాత్రి జల నారాయణస్వామికి మంగళహారతుల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

భార్యను హత్య చేసిన భర్త

- మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కుషాయిగూడలో ఘటన
- మృతురాలి స్వస్థలం అడ్డగూడూరు



మంజుల (ఫైల్)

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలం కేంద్రానికి చెందిన మహిళ హైదరాబాద్‌లో తన భర్తలో చేతిలో దారుణ హత్యకు గురైంది. వివరాలు.. అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన బోడ శంకర్‌కు 18 ఏళ్ల క్రితం మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన మంజుల (45)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. శంకర్ జీవనోపాధి కోసం కుటుంబంతో కలిసి ముంబైకి వలస వెళ్లి అక్కడే ప్లంబర్‌గా పనిచేస్తుండేవాడు. కొంతకాలంగా వీరి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల మంజుల ముంబై నుంచి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కుషాయిగూడలోని మహేష్‌నగర్ కాలనీలో నివాసముంటున్న తన సోదరి ఇంటికి వచ్చింది. శుక్రవారం శంకర్ కూడా ముంబై నుంచి కుషాయిగూడలో మంజుల సోదరి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో పెద్ద మనుషులు శంకర్, మంజులతో మాట్లాడి సర్దిచెప్పారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రించిన మంజులపై శంకర్ విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమె కేకలు వేయడంతో శంకర్ అక్కడి నుంచి పారిపోయాడు. అప్పటికే మంజుల మృతిచెందింది. ఈ ఘటనపై కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంజుల మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం శనివారం రాత్రి కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డగూడూరుకు తీసుకొచ్చారు. మృతురాలి పెద్ద కుమారుడు ముంబైలో ఉండడంతో ఆదివారం అంత్యక్రియలు చేయనున్నట్లు బంధువులు తెలిపారు.

ప్రైవేట్ క్లినిక్‌లలో తనిఖీలు



హాలియాలో క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు

హాలియా: అర్హతలు లేకున్నా పలువురు ఆర్‌ఎంపీలు క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని వైద్యం చేస్తున్నారనే సమాచారంతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ గుండగాని, డాక్టర్ శ్రీకాంత్ శర్మ నేతృత్వంలో శనివారం హాలియా, నిడమనూరు మండల కేంద్రాల్లోని ప్రైవేట్ క్లినిక్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. నిడమనూరు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, సంధ్య డయాగ్నొస్టిక్ సెంటర్, శివ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, హాలియాలోని స్టార్ క్లినిక్, బహదూర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, దాసు ఫస్ట్ ఎయిడ్ సెంటర్, వెంకట్ పద్మ క్లినిక్‌లో అర్హత లేకున్నా ఆర్‌ఎంపీలు వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ఆయా క్లినిక్‌ల నిర్వాహకులు కాశయ్య, స్వాతి, బాలకృష్ణ, సైయ్యద్, పాండు, బహదూర్, దాసుపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు మెడికల్ కౌన్సిల్ సభ్యులు తెలిపారు. ఎంబీబీఎస్ అంతకంటే ఉన్నత డిగ్రీ కలిగి తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయిన వైద్యులు మాత్రమే వైద్యం నిర్వహించాలన్నారు. ఎలాంటి అర్హతలు లేకుండా ఆర్‌ఎంపీలు ఇంజెక్షన్లు ఇవ్వడం, సెలైన్‌లు ఎక్కించడం, మందులు రాయడం చట్టవిరుద్ధమని వారు పేర్కొన్నారు.

రెండు మృతదేహాలు లభ్యం

బీబీనగర్: బీబీనగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన బర్ల సురేందర్, గూడూరు పరిధిలోని చిన్నేటి వాగులో గల్లంతైన గండు నరేష్ మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల18న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నాచారం ప్రాంతానికి చెందిన గండు నరేష్(23) బీబీనగర్ మండలం గూడూరు గ్రామ పరిధిలోని చిన్నేటి వాగు బ్రిడ్జి పైనుంచి దాటుతుండగా వరద తాకిడి గల్లంతయ్యాడు. శనివారం అన్నంపట్ల వద్ద వాగులో నరేష్ మృతదేహం లభ్యమైంది. అదేవిధంగా హన్మకొండ జిల్లా రాంనగర్‌కు చెందిన సురేందర్(36) ఈ నెల 19న బీబీనగర్ పెద్ద చెరువులో దూకగా.. రెస్క్యూ బృందం శనివారం మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని గొర్రెలు మృతి

- గొర్రెల కాపరికి తీవ్రగాయాలు

నకిరేకల్: అతివేగంగా వచ్చిన కారు అదుపుతప్పి రోడ్డుపై వెళ్తున్న గొర్రెల మంద పైకి దూసుకెళ్లడంతో 7 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల కాపరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం రాత్రి నకిరేకల్ మండలం తాటికల్ గ్రామ శివారులో జరిగింది. వివరాలు.. తాటికల్ గ్రామ శివారులోని తెట్టెకుంటకు చెందిన ఎద్దు సత్తయ్య భార్య మంగమ్మ శనివారం సాయంత్రం తమ గొర్రెలను మేపుకుని ఇంటికి వస్తుండగా.. నల్ల గొండ నుంచి నకిరేకల్ వైపు వస్తున్న కారు అతివేగంగా వచ్చి గొర్రెలను, ఒక గేదె, మంగమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంగమ్మకు తీవ్ర గాయాలు కాగా.. 7 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. కారు ముందు భాగంలో ఓ గొర్రె పిల్ల ఇరుక్కుపోగా.. డ్రైవర్ కారును ఆపకుండా ఐదు కిలోమీటర్ల దూరం ఈడ్చుకెళ్లాడు. సమీప గ్రామ ప్రజలు కారును వెంబడించి పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాధితుడు సత్తయ్య నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సైబర్ నేరగాళ్ల టోకరా

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన ఓ మహిళ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన మహిళకు శనివారం సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి 'ఆరోగ్య శ్రీ పథకం కింద మీకు రూ.14వేలు వచ్చాయని చెప్పారు'. అయితే తాము ఎలాంటి ఆరోగ్య శ్రీ పథకానికి దరఖాస్తు చేయలేదని సదరు మహిళ సమాధానం ఇచ్చింది. కొద్దిసేపటి తర్వాత సైబర్ నేరగాళ్లు మరోసారి ఆమెకు ఫోన్ చేసి వాట్సాప్‌కు లింక్ పంపాం.. దానిని ఓపెన్ చేస్తే మీ డబ్బులు మీ ఖాతాలోకి వస్తాయని చెప్పారు. దీంతో ఆమె పక్కింటి వారి సహకారంతో వాటాప్స్‌లో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేసింది. వెంటనే ఆమె బ్యాంకు ఖాతాలోని రూ.28,800 నగదు ట్రాన్స్‌ఫర్ అయినట్లు బ్యాంకు నుంచి మెసేజ్ వచ్చింది. దీంతో చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

చిలుకూరు: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త సంధ్యారాణి సూచించారు. శనివారం మండల పరిధిలోని కొండాపురం, చిలుకూరు, ఆచార్యులగూడెం, దూదియాతండా రోడ్డులో వరి పొలాలను స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిశోధన కేంద్రాల్లో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసి విత్తనోత్పత్తిని ప్రోత్సహించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతుల పొలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి శ్రీధర్, ఏఈఓలు శిరీష, చంద్రశేఖర్, త్రివేణి, రైతులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో మొగి పురుగు నివారణ

- భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త సీహెచ్. పద్మావతి



లింగాకర్షక బుట్టల వినియోగం గురించి వివరిస్తున్న భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త పద్మావతి

గరిడేపల్లి: వరిలో మొగిపురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు వాడాలని భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త సీహెచ్. పద్మావతి అన్నారు. భారతీయ వరి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలో రైతులకు కాండం తొలుచు పురుగు లేదా మొగి పురుగు నివారించడానికి నెమ్మదిగా విడుదలయ్యే ఫిరమూన్ ఎరల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత వరి పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన నెమ్మదిగా విడుదలయ్యే ఎరలు మొగి పురుగు పర్యవేక్షణకు ఎకరానికి మూడు ట్రాప్పులు మరియు నివారణకు 12 ట్రాపులు పెట్టుకోవాలని సూచించారు. ఈ ఎరలు మగ పురుగులను ఆకర్షిస్తాయని, దీని వలన మొగి పురుగు ఉధృతి తగ్గుతుందని ఆమె తెలిపారు. అనంతరం రైతులకు ఫిరమూన్ ఎరలను పంపిణీ చేసి, వాటిని పొలంలో ఎలా అమర్చుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, కిరణ్, ఆదర్శ్, ఎన్. సుగంధి, సాయికిరణ్, అజయ్, అరవింద్, ఇఫ్కో మేనేజర్ వెంకటేష్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఒకే తండా నుంచి ముగ్గురికి ఎంబీబీఎస్ సీట్లు



లచ్చిరాం



సాయి



నందు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ఒకే తండా నుంచి ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. తిరుమలగిరి(సాగర్) మండలంలోని ఎర్రచెరువుతండాకు చెందిన రమావత్ జయరాం, లక్ష్మి దంపతుల కుమారుడు లచ్చిరాం. రమావత్ సర్దార్, శారద దంపతుల కుమారుడు సాయి. రమావత్ కృష్ణంరాజు, పద్మ దంపతుల కుమార్తె నందు నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎలాంటి కోచింగ్ లేకుండా సీట్లు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఒకే గ్రామం నుంచి ముగ్గురు సీట్లు సాధించడంతో గ్రామస్తులు శాలువాలతో వారిని సన్మానించారు.

కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఆత్మహత్య



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

తుర్కపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలం చిన్నలక్ష్మాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నలక్ష్మాపురం గ్రామానికి చెందిన దుబాల శ్రీకాంత్‌రెడ్డి(40)కి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరు గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా వారి కుటుంబంలో కలహాలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చింత చెట్టుకు ఉరేసుకున్నాడు. శనివారం ఉదయం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి దుబాల నరసింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తక్యుద్దీన్ తెలిపారు.